

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, వీబీజీ వ్యవస్థాపకులు మడిపడిగ రాజు కలిసి పూలబొకే ఇచ్చి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ చిత్రపటాన్ని బహూకరించారు. - బర్కత్‌పుర



మహిళలకు దుస్తులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఫాస్టర్ శ్యామ్ అబ్రహం, ఆర్ మోజేస్

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థల వారు, వ్యాపారులు సేవాభావంతో పేదలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చ్‌లో బీఆర్ఎస్ నగర కార్యదర్శి ఆర్.మోజేస్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో పేదలకు అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్.మోజేస్, ఎమ్మెల్యే గోపాల్, శ్యామ్ అబ్రహంను శాలువాలతో సన్మానించారు. చర్చ్ ఫాస్టర్ బ్రహం, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రభాకర్, నాయకులు కృపావరం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలని తైక్వాండో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి సీహెచ్.మారుతీవరప్రసాద్ అన్నారు. తైక్వాండో చాంపియన్‌షిప్ 2025 పోటీలను తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ.. కరాటేతో తనను తాను రక్షించుకోవడంతోపాటు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తైక్వాండో క్రీడాకారులు మీర్ వహాజ్, అలీఖాన్, మహేశ్వర్, మల్లిక, కృష్ణ, నర్సింహ, విజయ్ కుమార్, సురేష్, ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

మెరుగైన జీవనానికి యోగాసనాలు దోహదం

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మెరుగైన జీవనం కోసం యోగాసనాలు దోహదం చేస్తాయని డాక్టర్ పి.రవిశంకర్ అన్నారు. ఆదివారం పద్మాకాలనీలో జి.సురేంద్రనాథ్ నిర్వహిస్తున్న యోగా శిక్షణా తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. యువత యోగాసనాలు చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్.ఓంప్రకాష్, పి.రవికిషోర్, ఎగణేష్, ఎల్.సుధీర్, ఎల్.రూపేందర్, జి.నిత్యానంద్, రఘు, బి.నరేష్, ఉమేష్, కె.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అనాథాశ్రమంలో పిల్లలకు పండ్లు పంపిణీ

ముషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నగర నాయకుడు రవీందర్ కోక సహకారంతో ఆదివారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో విద్యార్థినులకు పండ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. 17 సంవత్సరాలుగా రవీందర్ కోక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రవీణ్, బి.ఆంజనేయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేష్, చంద్రకాంత్, నందు, వినయ్, మహ్మద్ ఇస్మాయిల్, మోజేస్, మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్లలో 2024-25లో ఆలిండియా టాపర్ కొటికె విఠల్ సూచించారు. ప్రముఖ సంఘసేవకురాలు సిర్నా సువర్ణ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం చిక్కడపల్లిలో పెద్దఎత్తున పేదలకు అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని విఠల్ ప్రారంభించి, మాట్లాడారు. ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ, ఆర్ఎస్ బ్రదర్స్, సౌతిండియా షాపింగ్‌మాల్ మాజీ యజమానులు రాజమౌళి, సిర్నా సువర్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. బర్కత్‌పుర బస్‌డిపో 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, టాటా టెలీసర్వీస్ పరిధిలో ఉదయం 11 నుంచి 1, సీసీష్రాఫ్ పరిధిలో 2.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఉర్దూహాల్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్-కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలుఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో మరొకరు..

ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం. 55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి ఉప్పుగూడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం 1లో తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 11 గంటల సమయంలో యాకత్‌పుర-ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల నడుమ 55 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలపై కూర్చున్నాడు. బెంగళూరు నుంచి కాచిగూడకు వస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు లోకోపైలెట్ ఆదివారం ఉదయం 5 గంటలకు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కటే ప్రభుత్వ 'మీ సేవ'.. రోజంతా అవస్థలే!

ఇబ్బందులు పడుతున్న అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు



శివం రోడ్‌లోని మీ సేవా కేంద్రం

- ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం
- మరో మూడు సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనం నగరంలో పేరొందిన అంబర్‌పేట నియోజకవర్గంలో కేవలం ఒక్కటే మీ సేవా కేంద్రం ఉండడం ఈ నియోజకవర్గంపై పాలకులు, ప్రజాప్రతినిధులకు ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుంది. ఈ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి, ప్రస్తుతం ఎంపీగా, కేంద్రమంత్రిగా జి.కిషన్‌రెడ్డి కొనసాగుతున్నారు. అదేవిధంగా ఈ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కాలేరు వెంకటేష్ మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడంపై శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే వెంకటేష్ 2018లో విజయం సాధించిన తర్వాత అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా మీ సేవా కేంద్రాల ఏర్పాటును పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం. నగరంలోని మిగతా నియోజకవర్గాల్లో మూడు నుంచి నాలుగు మీ సేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయగా, అంబర్‌పేట నియోజకవర్గాన్ని మాత్రం విస్మరించిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ నియోజకవర్గంలోనే మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఉంటున్నా, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా మీ సేవా కేంద్రాల ఏర్పాటుపై ఆయన శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. పక్కనే ఉన్న ముషీరాబాద్ నియోజకవర్గంలో 4 మీ సేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ అంబర్‌పేట నియోజకవర్గంలో మాత్రం శివంరోడ్‌లోని బాగ్‌అంబర్‌పేట డివిజన్ శాంతిలాల్ నవోదయ ఆస్పత్రి సమీపంలో ఒక్క మీ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నియోజకవర్గంలో ఐదు మున్సిపల్ డివిజన్లకు చెందిన ప్రజలు ఏ పని కావాలన్నా ఈ మీసేవా కేంద్రానికి రావాల్సి వస్తోంది. విద్యుత్, మంచినీరు, మున్సిపల్ ట్యాక్స్, ఆధార్‌కు సంబంధించిన విషయాలపై ప్రజలు మీసేవా కేంద్రానికి వస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

కొత్త రేషన్‌కార్డులకు పోటెత్తిన దరఖాస్తుదారులు

కొత్త రేషన్‌కార్డుల కోసం శివంరోడ్‌లోని మీ సేవా కేంద్రంలో దరఖాస్తులు చేయడానికి ప్రజలు తరలివస్తున్నారు. దీంతో మీ సేవ కేంద్రం దరఖాస్తుదారులతో కిటకిటలాడుతోంది. ఉదయం నుంచి దరఖాస్తు చేయడానికి ప్రజలు బారులుతీరుతున్నారు. దూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు దరఖాస్తు చేయడానికి వస్తుండడంతో సాయంత్రం వరకు కూడా రద్దీ తగ్గడం లేదు. దీంతో వృద్ధులు, మహిళలు దరఖాస్తు చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు.

కాచిగూడ, గోల్నాక, అంబర్‌పేట డివిజన్ ప్రజలకు ఈ మీసేవా కేంద్రం దూరంగా ఉండడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గోల్నాక డివిజన్ అశోక ఫంక్షన్‌హాల్ సమీపంలో గతంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఇటీవల మూసివేశారు. దీంతో ఆధార్‌కు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు శివంరోడ్‌లోని మీసేవా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంబర్‌పేట నియోజకవర్గంలో మరో మూడు మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జి.కిషన్‌రెడ్డి, వెంకటేష్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికులను మోసం చేస్తున్న కేంద్రం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



సంజీవరెడ్డిని సత్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. కార్మికులకు అనుకూలంగా వ్యవహరించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా కార్మికులను మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో వీఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ జాతీయఅధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు, పరిశ్రమలను కాపాడినప్పుడే ఉద్యోగాలు ఉంటాయన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడానికి కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జి.జనక్‌రాజ్ మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్టీ వర్కర్స్ యూనియన్ నేతలు రాజు, ఎల్.డి పాల్, ఏ.ఆర్.శ్రీనివాస్‌యాదవ్, నాగేష్, కృష్ణారెడ్డి, సప్తజిత్తిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, నాగన్నగౌడ్, విజయ్‌కుమార్, జగన్‌మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.



యాదగిరిని సన్మానిస్తున్న బస్తీ నేతలు

చిత్రాలనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా యాదగిరి

కవాడిగూడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ చిత్రాలనగర్ బస్తీకమిటీ అధ్యక్షుడిగా బెజగం యాదగిరి ఎన్నికయ్యారు. చిత్రాలనగర్‌లో బస్తీ కమిటీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ నిర్వహించారు. బస్తీలో దాదాపు 500కు పైగా ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 221 ఓట్లు పోలవ్వగా యాదగిరికి 163ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థిగా పోటీచేసిన లక్ష్మికి 58ఓట్లు వచ్చాయి. బెజగం యాదగిరి 105 ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారులుగా బస్తీకి చెందిన బి.విశ్వనాథ్, పి.నర్సింగ్‌రావు, భరత్, హరికాంత్, ఎస్.విశ్వనాద్ వ్యవహరించారు. కవాడిగూడ డివిజన్‌లోనే చిత్రాల నగర్ బస్తీని ఆదర్శబస్తీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా బస్తీవాసులు బాణసంచా పేల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

ఏకాగ్రత, క్రమశిక్షణను నేర్పేది నాట్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రత, క్రమశిక్షణను నాట్యం నేర్పుతుందని బాలల సాహిత్య రచయిత చొక్కాపు వెంకటరమణ అన్నారు. నృసింహ కూచిపూడి నాట్యభారతి ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో సుప్రజనాయని శిష్యబృందం కూచిపూడి నాట్య అంశాలు ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చొక్కాపు రమణ మాట్లాడుతూ గురువు ప్రతిభ శిష్యుల ప్రదర్శన వల్ల తెలుస్తుందన్నారు. సుప్రజ శ్రీనివాస్ ఉత్తమ నాట్యగురువులు అని అభినందించారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, వ్యాఖ్యాత గాంధీ, సంస్థ స్థాపకుడు శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం

శాస్త్రీయ దృక్పథంలో ఎస్ఎస్ఎఫ్ కీలకపాత్ర

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో ఎస్ఎస్ఎఫ్ పాత్ర చాలా ఉందని ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎఫ్‌ను బలోపేతం చేయాలని, శాస్త్రీయమైన విద్యా విధానం కోసం ఐక్యపోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజాకవి జయరాజ్ మాట్లాడుతూ ప్రకృతిలో మమేకమై సైన్స్‌ను ప్రచారం చేస్తూ సమసమాజ నిర్మాణంలో ఎస్ఎస్ఎఫ్ భాగం కావాలని అన్నారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్ మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందుతుంటే మత, అంధ విశ్వాసాలు, మూఢనమ్మకాలను పారద్రోలడంలో ఎస్ఎస్ఎఫ్ తనవంతు కృషి చేస్తూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జయరవి, జయగోపాల్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేదాంత మౌర్య, ద్రావిడ విజయ్, జర్నలిస్టు రాకేష్, మోహన్, వెంకటేష్, సత్యశోధక్, శివకల్యాణి, అన్వేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాధవరావు సంస్మరణ సభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ సుదర్శన్

గొర్రెపాటి మాధవరావు చిరస్మరణీయుడు

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన నిలిచిపోరాడిన గొర్రెపాటి మాధవరావు చిరస్మరణీయుడని, ఆయన మరణం పేద ప్రజలకు తీరని లోటని జస్టిస్ సుదర్శన్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో న్యాయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయం కోసం వచ్చిన పేదల పక్షాన పోరాడి ప్రజల హక్కుల నేతగా అందరి హృదయాలలో నిలిచిపోయారని కొనియాడారు. మానవ హక్కుల వేదిక మాజీ అధ్యక్షుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ విలువలకు కట్టుబడి ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండేవారని అన్నారు. రాజ్యాంగం, న్యాయం, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తూ ఎన్నో వ్యాసాలు రాశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, నాయకులు, న్యాయవాదులు కృష్ణరావు, రవి, కె.గోవర్ధన్, చంద్రశేఖర్, రామకృష్ణ, మీరాసహాని, స్మైలీ, బాబురావు, శంకర్, మార్వాడి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో పేర్లు నమోదు చేయించుకోవాలి: నిరంజన్

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మొదటి దఫా కుల గణనలో పేర్లునమోదు చేసుకోలేని బీసీలు రీ సర్వేలో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సూచించారు. కుల గణన రీ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం ఆయన బీసీ వెల్ఫేర్ అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి చాంద్రాయణగుట్ట కుమ్మరివాడి బస్తీలో ప్రజలకు అవగాహన కల్పించారు. సర్వేలో పేర్లు నమోదు చేసుకోలేకపోయినవారి వివరాలను ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు సేకరించారు. 200 ఇళ్లను పరిశీలించగా అందులో 71 కుటుంబాల పేర్లు నమోదు చేసుకోలేదన్న విషయం తేలింది. సర్వే స్టిక్కర్లు అంటించారు.. కానీ ఎన్యుమరేటర్లు తమ ఇంటికి రాలేదని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ..ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు రీ సర్వే చేపడుతున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

దేశ భవిష్యత్ కోసం అభ్యుదయ సంఘాలు కలిసి పనిచేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ కోసం అభ్యుదయ సంఘాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జేవీవీ జాతీయ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన అభ్యుదయ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక అంశాల్లో ప్రజా సంఘాలు కిందిస్థాయిలో పనిచేయాలన్నారు. దోపిడీ చేస్తున్న వర్గాలన్నీ ఐక్యమత్యంగా ఉన్నారని, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వారంతా విడిపోయి ఉన్నారన్నారు. కామన్ ఎజెండాతో పనిచేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, నాయకులు తులసీరామ్, ప్రసాద్, జ్యోత్స్న, రామ్‌బ్రహ్మం, విజ్ఞానదర్శిని, తాటి రమేష్, బాషా, ఈశ్వరలింగం, కొండల్‌రెడ్డి, జిట్టా భాస్కర్‌రెడ్డి, విప్లవ్, స్కైలాబ్, వహీద్, డాక్టర్ ప్రతిభాలక్ష్మి, విజయకందుకూరి, కృష్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సప్త కళాకారులకు సత్కారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై సోమవారం సాయంత్రం ప్రముఖ సంగీత రంగ కళాకారులతో పాటు నాట్యగురువుకు సప్తకళాకారుల పేరిట సత్కారం నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు చెన్నారావు తెలిపారు. త్యాగరాయ గానసభలోని సమావేశమందిరంలో శనివారం మధ్యాహ్నం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ రమణాచారి జన్మదిన సందర్భంగా రాఘవాచారి, హరిప్రియ, డీవీ మోహనకృష్ణ, ద్వారం సత్యనారాయణ, ధూళిపాళ్ల శ్రీరామమూర్తి, జానకిరాములుతోపాటు నాట్యగురువు డా.అలేఖ్య పుంజలను వివిధ బిరుదులతో సత్కరిస్తామని తెలిపారు. ఇటీవల పద్మశ్రీ అవార్డు ప్రకటించబడిన సహస్రావధాని డా. నాగఫణిశర్మకి అభినందన పూర్వక సత్కారం చేస్తామని, డా.కేవీ.రమణాచారి పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు వినోద్‌బాబు బృందం సినీగీతాలతో పాటు నాదస్వర విన్యాసం ఉంటాయన్నారు.

ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఉచిత శిక్షణ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ చైర్మన్ ఎం.సి.శేఖర్ తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులో 6 నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఫొటోగ్రఫీతో పాటు వెడ్డింగ్, ఇండస్ట్రీయల్, ఫ్యాషన్ తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. మార్చి 15 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 8008021075, 7095692175 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

'వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో తగ్గేదేలేదు'

నల్లకుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను విచ్ఛిన్నం చేస్తూ కొంతమంది నాయకులకు ఎరచూపి వర్గీకరణను వ్యతిరేకిస్తున్న మాల మహానాడు నేతలను ఫోన్ల ద్వారా బెదిరింపులకు గురిచేసే కుట్ర జరుగుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. ఆదివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్న మాల నేతలు తనతోపాటు మాల సంఘం జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్, ఇతరులను ఫోన్లో బెదిరిస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా తమ పోరాటం తగ్గేదేలేదని ఆయన స్పష్టం చేశారు. వర్గీకరణను అడ్డుకోకపోతే మాల ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు మాలద్రోహులుగా నిలిచిపోతారని ఆయన హెచ్చరించారు.

'వర్గీకరణ కుట్రలు అడ్డుకోవాలి'

కవాడిగూడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి జరుగుతున్న కుట్రను మాల ప్రజాప్రతినిధులు అడ్డుకోవాలని, లేనిపక్షంలో మాల సమాజం వారిని క్షమించదని, ద్రోహులుగా చరిత్రలో మిగిలిపోతారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్.రాజు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జె.ఎన్.రావు, బేగరి చంద్రశేఖర్ అన్నారు. మాలమహానాడు కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన ఉమ్మడి రిజర్వేషన్ హక్కుల రక్షణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ మాల మంత్రులు, ఎమ్మెల్యే అనుచరులైన కొంత మంది మాల సంఘాల జేఏసీల పేరుతో చలామనిలో ఉన్న ఏజెంట్ల ద్వారా మాలల ఉద్యమాన్ని, శక్తిని బలహీనపర్చి నిర్వీర్యం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్నారని ఆరోపించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ హెల్త్‌సిటీ, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెల్త్‌సిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి శ్రీసాయిడయాగ్నస్టిక్‌సెంటర్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా మధుమేహ(షుగర్), కొలెస్ట్రాల్, బీపీ పరీక్షలు నిర్వహించారు. క్యాంప్ చైర్మన్ జీకే.రమణ, సతీష్, సాయిరితీష్, వంశీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ప్రధానిని దూషించిన సీఎంపై బీసీలు తిరగబడాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీని కులం పేరుతో దూషించిన సీఎం రేవంత్‌రెడ్డిపై బీసీలు తిరగబడాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీని కులపరంగా విమర్శించే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని, కాంగ్రెస్ అధిష్ఠానం మెప్పు పొందడానికి రేవంత్‌రెడ్డి దిగజారి ప్రధాని మోదీపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం బర్కత్‌పురలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ ఏ కులమైతే రేవంత్‌రెడ్డికి సంబంధం ఏమిటని, ఏ నాడూ మోదీ కుల ప్రస్తావన చేయలేదన్నారు. మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలి : టీయూసీఐ



మహాసభలో ప్రసంగిస్తున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి వారి ఆస్తులను కార్పొరేట్లకు అప్పగిస్తుందని, ఈ లేబర్ కోడ్స్ రద్దుకు ఐక్యంగా ఉద్యమించాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల టీయూసీఐ ప్రథమ మహాసభలను టీయూసీఐ అధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన వనమాల కృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విమాన, నౌకాయాన, రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసీ, డిఫెన్స్, భూగర్భ ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని ధ్వజమెత్తారు. కార్మికులంతా సంఘటితమై హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సీయూసీఐ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు ఎం.హన్మేష్, నాయకులు సి.ప్రవీణ్, ఎం.డి.అఫ్జల్, ఎస్.శ్రీనివాస్, ఎన్.నల్లన్న, డి.లక్ష్మి, వీరమణి పాల్గొన్నారు.